క్లుప్తంగా

మళ్లీ జగన్ ప్రభంజనమే



తాడిమర్రి నుంచి సభకు వెళుతున్న శ్రేణులతో డీసీఎంఎస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

తాడిమర్రి : సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ జగన్ ప్రభంజనమే కొనసాగుతుందని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖరరెడ్డి స్పష్టం చేశారు. ఫ్యాన్ గాలికి టీడీపీ, జనసేన తదితర విపక్ష పార్టీలన్నీ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. రాప్తాడు వద్ద ఆదివారం జరిగిన సీఎం జగన్ 'సిద్ధం' మహాసభకు ఆయన ఆధ్వర్యంలో 50 బస్సుల్లో జనం తరలివెళ్లారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు విశ్వసనీయతకు, పచ్చి అబద్ధాలకు మధ్య జరుగుతున్నవని అభివర్ణించారు. ఈ ఎన్నికలతో టీడీపీ, జనసేల పార్టీలు కనుమరుగు కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు యర్రగంగు కృష్ణమనాయుడు, బీసాని లింగమ్మ, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు పారాళ్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జొల్లిరెడ్డి అశ్వత్థు, మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజనేయులు, నాయకులు మదమంచి మల్లికార్జున నాయుడు, సల్లాపురం బాలరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కార్యకర్త మృతి



పర్వతయ్య(ఫైల్)

తాడిమర్రి: రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభకు వెళుతూ గుండెపోటుకు గురై వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు రామాపురం సర్పంచ్ కుంటాల పుల్లయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం రాప్తాడులో ఏర్పాటు చేసిన సీఎం జగన్ సిద్ధం సభకు బస్సుల్లో ఉదయం బయలుదేరివెళ్లారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో రాప్తాడు సమీపంలో పంగల్‌రోడ్డు వెళుతుండగా కుంటాల పర్వతయ్య (58) అనే కార్యకర్త గుండెపోటుకు గురై సీటులో కుప్పకూలిపోయాడు. వెంటనే బస్సులోని బంధుమిత్రులు ఆయనను అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అతన్ని పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య రమాదేవి, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం అందుకున్న డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి, సంతాపం తెలిపారు.

సింహగర్జనకు విరాళం



నగదు అందజేస్తున్న సోమ్లానాయక్

కదిరి అర్బన్: కదిరిలో ఈ నెల 25న జరిగే బంజారాల సింహగర్జన మహా సదస్సుకు ఏపీ గిరిజన మాజీ కో ఆపరేటివ్ సొసైటీ మెంబర్ సోమ్లానాయక్ రూ.50 వేల విరాళాన్ని ఆదివారం నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు చక్రినాయక్, కాలేనాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

'లెనిన్ జీవిత కథనం' పుస్తకావిష్కరణ



లెనిన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఎల్ఐసీ అభివృద్ధి అధికారి పిల్లా కుమారస్వామి 'లెనిన్ నేడు లేడా? – చూడు జనంలో ఉన్నాడు!' పేరిట రచించిన లెనిన్ జీవిత కథనం పుస్తకాన్ని సైదాపురం ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారల్ మార్క్స్ సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన మహనీయుడు లెనిన్ అని పేర్కొన్నారు. పీడిత ప్రజల కోసం పెట్టుబడిదారి, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించారన్నారు. సమాజ హితం కోసం పాటుపడిన లెనిన్ జీవితం గురించి పుస్తక రూపంలో పిల్లా కుమారస్వామి తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు సుబ్బిరెడ్డి, జీఎల్.నరసింహులు, రాజేంద్ర, రామకృష్ణ, బాబ్జాన్, వివిధ ప్రజా సంఘాల నాయకులు రియాజ్, మాబున్నీసా, ముస్తాక్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్ సమీపంలో మినీ బస్సు ఢీకొని మొరంపల్లికి చెందిన రామచంద్రారెడ్డి (50) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు... ఆదివారం రాత్రి డాబా వద్ద నుంచి సర్వీసు రోడ్డులో రామచంద్రారెడ్డి, రామారావు కొడికొండ చెక్‌పోస్ట్ వైపునకు వస్తుండగా ఎదురుగా వచ్చిన మినీ బస్సు ఢీకొంది. రామచంద్రారెడ్డి మృతి చెందగా రామారావు తీవ్రంగా గాయపడ్డారు.

చీకిరేవులపల్లి కేరాఫ్ అభివృద్ధి

- పంచాయతీలోని అన్ని పల్లెలకు తారు, సీసీరోడ్లు
- వివిధ పథకాల ద్వారా 4,587 మందికి లబ్ధి
- పథకాల కింద రూ.14.69 కోట్ల అందజేత



రూ 2.31 కోట్లతో చీకిరేవులపల్లికి నిర్మించిన తారురోడ్డు



అమడగూరు: మండలంలోని చీకిరేవులపల్లి అభివృద్ధికి కేరాఫ్‌గా నిలుస్తోంది. గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారినా గ్రామం గురించి పట్టించుకున్న నాథులే కరువయ్యారు. 2019లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఈ పంచాయతీలోని శీతిరెడ్డిపల్లి, చీకిరేవులపల్లి, నల్లగుట్లపల్లి, రెడ్డివారిపల్లి అన్ని గ్రామాలకు తారు, సీసీ రోడ్లను వేయించారు. ఈ రోడ్ల నిర్మాణాల కోసం రూ 3.75 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. గ్రామంలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణాల కోసం రూ.85 లక్షలను విడుదల చేసింది. గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ నేరుగా ఇళ్లకే చేరుతున్నాయి. వైకేపీ ద్వారా వివిధ రకాలుగా రుణాలను పొందిన వారు స్వయం ఉపాధి పొందుతున్నారు. ఈ ప్రభుత్వంలో మా గ్రామ అభివృద్ధిని ఎంతగానో చూస్తున్నామని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ..

సంక్షేమ పథకాలకు సంబంధించి నగదును ఎవరి ప్రమేయం లేకుండా ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేసింది. తద్వారా పథకాల అమల్లో దళారులు, అవినీతికి అవకాశం ఇవ్వలేదు. చీకిరేవులపల్లి పంచాయతీలో జగనన్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతిదీవెన, రైతు భరోసా, ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ రుణాలు, పింఛన్ కానుక, చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం, నేతన్న నేస్తం, కాపు నేస్తం, ఇన్‌పుట్ సబ్సిడీ, ఆరోగ్యశ్రీ, వాహనమిత్ర చేదోడు తదితర పథకాల కింద 3456 మందికి రూ.10.96 కోట్ల నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమన చేశారు.

పంచాయతీలో నాన్ డీబీటీ లబ్ధిదారులు, నిధుల వివరాలు(రూ.లలో)

ఇంటి స్థలాలు	80	1,96,80,000
జగనన్న విద్యాకానుక	112	7,95,424
8వ తరగతి వారికి ట్యాబ్‌లు	17	2,24,774
జగనన్న తోడు రుణాలు	55	10,24,045
జగనన్న గోరుముద్ద	97	9,60,979
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	75	14,04,750
ఇంటింటికీ రేషన్	605	1,32,15,620
మొత్తం	1,041	3,73,05,592

కళ్ల ముందు అభివృద్ధి కనపడుతోంది..



నాకు ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి చాలా సార్లు ఓటేశాను. ఎన్నో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. ఏనాడూ మా గ్రామం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. అయితే జగన్ వచ్చాక మా గ్రామంలో చాలా అభివృద్ధి కళ్ల ముందు కనపడుతోంది. గతంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఎక్కడ చూసినా తారురోడ్లే.

– పూజారి వెంకటరమణ, చీకిరేవులపల్లి

వెంటనే ఇల్లు మంజూరు



మా కుటుంబమంతా బెంగళూరుకు వెళ్లి బతుకుతున్నాం. ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేస్తోందని తెలుసుకుని ఊరికి వచ్చి సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా. వెంటనే ఇల్లు మంజూరు చేశారు. మేము కూడా త్వరగా నిర్మాణాన్ని పూర్తి చేశారు. మేము బెంగుళూరులో ఉన్నా ఏ పథకం వచ్చినా వలంటీర్ ఫోన్ ద్వారా తెలియజేసి పనులు చేయిస్తున్నాడు. ఇంతకన్నా మంచి ఎవరు చేస్తారు.

– అంజినమ్మ, శీతిరెడ్డిపల్లి

అర్హత ఆధారంగా మంజూరు



గ్రామంలో ఎవరికైనా, ఏ పథకానికైనా దరఖాస్తు చేసుకుంటే చాలు, పరిశీలించి అర్హత ఉన్నట్లయితే వెంటనే మంజూరు చేస్తాం. ఎవరి సిఫారసులు అక్కర్లేదు. పార్టీ, కుల, మత విభేదాల్లేకుండా పథకాలను అమలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. లంచాలకు తావు లేకుండా గ్రామస్తులే నేరుగా వలంటీర్‌తో గ్రామ సచివాలయానికి వారి పనులు చేసుకుని పోతున్నారు.

– చంద్ర, పంచాయతీ కార్యదర్శి, చీకిరేవులపల్లి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న కాటమయ్య

ధర్మవరం అర్బన్: పట్టణంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని జగ్జీవన్‌రాంనగర్‌కు చెందిన కాటమయ్య యర్రగుంట వద్ద రోడ్డు దాటుతుండగా అటుగా వచ్చిన టెంపో వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడి ఎడమ కాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో పూజలు



రామగిరి: మండలంలోని పేరూరులో ఆదివారం మద్వజయంతి సందర్భంగా హనుమ, భీమ మద్వ దేవస్థానంలో ఆలయ అర్చకుడు గండప్ప స్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే స్వామిని వివిధ రంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ పూజల్లో మహిళలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు హరిహర క్షేత్రం ప్రారంభం



విద్యుద్దీపాలంకరణలో హరిహర క్షేత్రం

పుట్టపర్తి రూరల్: జిల్లాలో అతిపెద్ద హరిహర క్షేత్రం ప్రారంభానికి సిద్ధమైంది. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని చిత్రావతి నది సమీపన ఎనుములపల్లి గ్రామంలో ఈ ఆలయం నిర్మించారు. దాతల సహకారంతో సుమారు రూ.3 కోట్లతో ఆలయ నిర్మించారు. రెండంతస్తుల విశాల భవనం, దేవుళ్ల ప్రతిమలతో చుట్టూ ప్రాకారం, ఆలయంపై 50 అడుగులకుపైగా ఎత్తులో ధ్యానముద్రలో ఆశీనులైన మహా శివుని భారీ విగ్రహం, సత్యసాయి బాబా, షిర్డీ సాయిబాబా, శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి, కాశీ విశ్వేశ్వర స్వామి, విశాలాక్షి సమేత అన్నపూర్ణాదేవి, ఆదిత్యాది నవగ్రహాలు, ఆంజనేయ స్వామి, దక్షిణామూర్తి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, కాలభైరవ, వీరభద్ర స్వామి, వంటి దేవుళ్ల ప్రతిమలు, కాశీ పుణ్యక్షేత్రం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన శివ లింగాలను ప్రతిష్టించారు.

నేటి నుంచి నాలుగు రోజుల పాటు కార్యక్రమాలు

ఆలయ ప్రతిష్ట మహోత్సవాన్ని నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 8 వరకు గణపతి పూజతో మొదలుకొని యజ్ఞ యాగాలతో ఆలయ ప్రారంభ వేడుకలు ప్రారంభమవుతాయి. 22న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మహా పూర్ణాహుతి నిర్వహిస్తారు. కార్యక్రమానికి సత్యసాయి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, కలెక్టర్ అరుణ్ బాబు ఎస్పీ మాధవరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ప్రముఖ వేద పండితులు హాజరవుతారని ఆలయ నిర్మాణ ధర్మకర్త శ్రీరాములు తెలిపారు.

గుండెపోటుతో ఆలయ అర్చకుడి మృతి



ప్రసాద్ స్వామి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలోని దుర్గమ్మ ఆలయ ఆలయ అర్చకుడు ప్రసాద్ స్వామి(48) గుండె పోటుతో మృతి చెందాడు. ఆదివారం ఉదయం తీవ్ర గుండెపోటు రావడంతో ఆయనను సత్యసాయి ఆస్పత్రికి తరలించారు. చికిత్స ప్రారంభించేలోపే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ప్రసాద్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

వైభవంగా బ్రహ్మరథోత్సవం

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామంలో వెలసిన కోడిరంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం వైభవంగా సాగింది. రథంపై స్వామివారు అశేష జన సందోహం మధ్య పురవీధుల గుండా ఊరేగారు. మొదట కోడిరంగనాథస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథం ముందు శాస్త్రోక్తంగా హోమాలు, పూజలు చేశారు. అనంతరం దేవాలయం నుంచి అశ్వత్థకట్ట వరకు రథంపై స్వామివారిని ఊరేగించారు.

సందడిగా చైనీస్ నూతన సంవత్సర వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు, చిత్రంలో ఆర్‌జె.రత్నాకర్ రాజు



సాయికుల్వంత్ సభా మందిరంలో లయన్ డ్యాన్స్ చేస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో చైనీస్ నూతన సంవత్సర వేడుకలు కొనసాగాయి. ఆదివారం ప్రశాంతి నిలయంలోని ఉత్తర భవనాల వెనుక మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద చైనీయులు వారి సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.అక్కడే ఏర్పాటు చేసిన అగ్ని గుండం వద్ద వారి సంప్రదాయాన్ని అనుసరిస్తూ తమ కోర్కెలను రాసిన పేపర్లను గుండంలో వేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు చైనీయులనుద్దేశించి ప్రసంగించారు. సత్యసాయి బోధనలను అనుసరిస్తూ ముందుకు సాగాలన్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత వేడుకలలో భాగంగా లయన్ డ్యాన్స్ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరి జరిగింది. ఈసందర్భంగా నిర్వహించిన ఉషు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

వైభవంగా సీతారామాంజనేయస్వామి వేడుకలు



విశేష పూజలందుకుంటున్న సీతా, రామ, లక్ష్మణ మూలవిరాట్లు

బత్తలపల్లి: పోట్లమర్రి గ్రామంలో వెలసిన సీతారామాంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలు నుంచి ఆలయ ప్రధాన అర్చకుడు కొమాండూరు మారుతి ప్రసాద్ పంచామృత అభిషేకం, వివిధ అర్చనలను చేపట్టారు. ఆంజనేయస్వామి, సీతారామలక్ష్మణులు, వినాయకుడు ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఆకుపూజ నిర్వహించారు. భజనలు, హనుమాన్ చాలీసా పఠించారు. అర్చకులు రమేష్ ప్రసాద్, సాయికృష్ణలతో పాటు గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వేంకటరమణుడు



హనమంత వాహనంపై ఊరేగుతున్న పేటవెంకటరమణస్వామి..

హిందూపురం: పట్టణంలోని మెయిన్ బజారులోని పేట వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హనుమంత వాహనంపై పట్టణ వీధుల్లో ఊరేగించారు.

అలా.. అలా.. రాప్తాడు వైపు

- సిద్ధం సభకు తరలిన అశేష జనం
- ప్రత్యేక వాహనాల్లో తరలిన అభిమాన తరంగం
- సభ సక్సెస్‌తో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్

ప్రతిపక్ష తెలుగుదేశం నేతల వెన్నులో మొదలైన వణుకు సార్వత్రిక ఎన్నికల సంగ్రామంలో వైఎస్సార్‌సీపీ సింహనాదం చేసింది. ఎన్నికల మేనిఫెస్టో హామీలు 99 శాతం అమలు చేసి ధైర్యంగా ఓటు అడిగేందుకు సీఎం వైఎస్ జగన్ సైన్యం సిద్ధమైంది. ఇచ్చిన ప్రతిమాటా నెరవేర్చిన జగన్‌కు జనం జైకొట్టారు. రాప్తాడు వద్ద జరిగిన 'సిద్ధం' బహిరంగ సభకు ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు స్వచ్ఛందంగా తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సమకూర్చిన ప్రత్యేక వాహనాలే కాకుండా సొంత వాహనాల్లోనూ ఉత్సాహంతో కదిలారు. సంక్షేమ పాలనను కొనసాగించుకునేందుకు తామంతా సిద్ధమంటూ విజయనాదం చేశారు.



కదిరిలో బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న కదిరి సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్

కదిరి అర్బన్: రాప్తాడులో ఆదివారం నిర్వహించిన 'సిద్ధం' సభకు కదిరి నియోజకవర్గ నలుమూలల నుంచి జనం అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కదిరి రూరల్ మండలం టోల్‌గేట్ వద్ద వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. ఇంత పెద్ద ఎత్తున జనం స్వచ్ఛందంగా సిద్ధం సభకు తరలివెళ్లడం ఇదే తొలిసారి అని అన్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో అందిన సంక్షేమ ఫలాలే ఇందుకు కారణమన్నారు. 225 బస్సులు,110 కార్లలో వేలాది మంది సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మహ్మద్ షాకీర్, బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తల హరిప్రసాద్, నాయకులు వజ్రభాస్కర్‌రెడ్డి, డాక్టర్ బత్తల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: రాప్తాడులో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగ సభకు మండలం నుంచి ఆదివారం ప్రజలు, నాయకులు భారీగా తరలివెళ్లారు. పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీ పల్లి, మాదాపురం, నసనకోట, రామగిరి, కుంటిమద్ది, పోలేపల్లి, గంతిమర్రి పంచాయతీల నుంచి 60కి పైగా బస్సుల్లో వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగరాజు, జెడ్పీటీసీ నాగార్జున, మండల కన్వీనర్ కక్రా హనుమంతరెడ్డి, సర్పంచులు రాజేష్, నరేంద్ర, ఓబిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, రామ్మూర్తి, సిద్దన్న, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు ఇతర మండల నాయకులు పాల్గొన్నారు.

నల్లచెరువు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు కదిరి సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ పిలుపు మేరకు మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల నుండి వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు స్థానిక ప్రజా ప్రతినిధులు శ్రేణులు సీఎం సభకు భారీగా తరలి వెళ్లారు.

ఓడీచెరువు: రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు వైఎస్సార్ అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. దాదాపు 60 బస్సులు 100కు పైగా కార్లు బయలుదేరి కేరింతలు వేసుకుంటూ ఉత్సాహంగా కదలి వెళ్లారు. మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ కుర్లి దామోదర్ రెడ్డి,ఎంపీపీ పర్వీన్ భాను,మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి షామీర్ బాషా, అగ్రి బోర్డు చైర్మన్ లక్ష్మి రెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్ళ క్రిష్టారెడ్డి తదితరులు జెండా ఊపి బయలు దేరారు.

బత్తలపల్లి: రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు మండలం నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డిల ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు దాదాపు 60 వాహనాలకుపైగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి సిద్ధం సభకు కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బెదిరింపులకు భయపడకుండా..

బత్తలపల్లి మండలం కట్టకిందపల్లి గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి సిద్ధం సభకు వెళ్లవద్దని బెదిరించినట్లు సమాచారం. అయితే వైఎస్సార్ సీపీ నాయకులు సర్పంచు చల్లా కరుణాకర్‌నాయుడు, డీలర్ రవీంద్రారెడ్డి కార్యకర్తలకు ధైర్యం చెప్పి సభకు తరలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బస్సు ఎక్కి తరలివెళ్లారు. దీంతో టీడీపీ నాయకుల ఎత్తులు చిత్తయ్యాయి.

తనకల్లు: రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు కదిరి సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహమ్మద్ పిలుపు మేరకు మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజా ప్రతినిధులు సీఎం సభకు భారీగా తరలి వెళ్లారు.

కనగానపల్లి: రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం సభకు కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలి వెళ్లారు. వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు రైతులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి గ్రామం నుంచి ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. కొంతమంది యువకులు ఉత్సహంగా బైక్ ర్యాలీలతో సభకు వెళ్లారు. వేల సంఖ్యలో వాహనాలు సభకు రావటంతో రహదారులన్నీ కిక్కిరిసి పోయాయి.



తనకల్లు మండలం నుంచి సిద్ధం సభకు వెళ్తున్న జనం



బత్తలపల్లి మండలం ఓబుళాపురం నుంచి వెళ్తున్న శ్రేణులు

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



నాట్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ధర్మవరం అర్బన్ : పట్టణంలోని మార్కెట్‌వీధిలో నున్న మార్కండేయస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన భద్రావతి భావనరుషీంద్రుల కల్యాణోత్సవం లలిత నాట్యకళానికేతన్ గురువు బాబు బాలాజీ, కమలా బాలాజీల శిష్య బృందం చేసిన భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థినుల నాట్య ప్రదర్శనను తిలకించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

మోడల్ పోలింగ్ కేంద్రం నేడు ప్రారంభం

పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి తో కలిసి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఇందులో ఏర్పాటు చేసే కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ , బ్యాలెట్ యూనిట్ల ద్వారా ఎన్నికల వరకూ ప్రజలకు ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారికి ఇందులో ఓటు ఎలా వేయాలో రెవెన్యూ అధికారులు తెలియజేస్తారని డీఆర్‌ఓ వివరించారు.